# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

❖ దావోస్ లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పలు సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

❖ ఎన్డీయే కూటమి ప్రభుత్వం గ్రామీణ సాధికారత దిశగా అడుగులు వేస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

❖ విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు.

❖ "పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన" పై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధికారులను ఆదేశించారు.

==============================

ప్రపంచ ఆర్థిక సదస్సు 2025ని పురస్కరించుకుని దావోస్ లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి పెట్టుబడులు సాధించే లక్ష్యంతో 3వ రోజు ప్రముఖ సంస్థల అధిపతులతో చర్చలు జరిపారు. దీనిలో భాగంగా గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ సమావేశమయ్యారు. గూగుల్ డిజైన్ కేంద్రాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా ఈ సందర్భంగా కోరారు. గూగుల్ క్లౌడ్ తన సర్వర్ సప్లై చైన్ అనుసంధానించేలా తయారీ కేంద్రాన్ని రాష్ట్రంలో నెలకొల్పాలని థామస్ కురియన్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే పెట్రోనాస్ కంపెనీ సీఈఓ ముహమ్మద్ తౌఫిక్‌తో జరిపిన చర్చలలో పెట్రోకెమికల్ హబ్‌గా అవతరిస్తున్న మూలపేటలోనూ, అలాగే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌లోనూ పెట్టుబడులు పెట్టాల్సిందిగా ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

==============================

ఎన్డీయే కూటమి ప్రభుత్వం గ్రామీణ సాధికారత దిశగా అడుగులు వేస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఈరోజు పశ్చిమగోదావరి జిల్లా ఊటాడ, యలమంచిలి, అడవిపాలెం గ్రామాల్లో కోటి రూపాయలతో వివిధ అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... పశ్చిమ గోదావరి జిల్లా

పాలకొల్లు నియోజక వర్గంలో గడచిన 6 నెలలు సమయంలో 60 గ్రామాలకు 100 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. రానున్న కాలంలో దశలు వారీగా అన్ని పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడం ద్వారా పరిశ్రమలను తీసుకువచ్చేందుకు  కృషి చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారాలతో రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని  మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.

==============================

విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. ఒంగోలు పట్టణంలో 6 కోట్ల 15 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న వెనుకబడిన తరగతుల బాలికల నూతన వసతి గృహానికి స్థానిక పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డితో కలసి మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలోని 143 కోట్ల రూపాయల వ్యయంతో వసతి గృహాలకు మరమ్మతులు చేస్తున్నామన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

అలాగే ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. ఈ వసతి గృహంలో 600 మంది విద్యార్థినులకు వసతి కల్పించబడుతుందన్నారు.

==============================

రాష్ట్రంలో ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పెద్దఎత్తున చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన, ప్రధానమంత్రి-కుసుమ్ పథకాలకు సంబంధించి ఈరోజు రాష్ట్ర సచివాలయంలో ఆయన అధ్యక్షతన ప్రథమ రాష్ట్ర స్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ  సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ... సౌర పలకల ఏర్పాటుతో నివాస గృహాలు విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు వీలుంటుందన్నారు. ఈ పథకాన్నిజాతీయ స్థాయిలో నేషనల్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీ (NPIA), రాష్ట్ర స్థాయిలో స్టేట్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీలు (SIA) అమలు చేస్తాయని తెలిపారు. కావున ఈ పథకం కింద డిస్కమ్‌లు తమ సంబంధిత ప్రాంతాల్లో రూఫ్‌టాప్ సోలార్‌ను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

==============================

తిరుపతి తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తి నేతృత్వంలో జ్యుడిషియల్ విచారణకు ఆదేశిస్తూ... ఉత్తర్వులు జారీ చేసింది. ఘటనపై ఆరు నెలల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈనెల 8న తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు.

విరామం

==============================

ఉత్తరాంధ్ర గిరిజనుల ఆరాధ్య దేవత, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన శ్రీ శంబర పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈరోజు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా జనవరి 27న తోలెళ్ళ ఉత్సవం, 28న సిరిమాను సంబరం, 29న అనుపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం ఈ జాతరకు ఉత్తరాంధ్ర నుండే కాకుండా ఒరిస్సా, ఛత్తీస్ ఘడ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు.

==============================

దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న గణతంత్ర వేడుకలకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరికి చెందిన షేక్ సందానీ.. షాహిన్ దంపతులకు ఆహ్వానం అందింది. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా ఉదయగిరిలోని చెక్క నగిషీ కేంద్రంలో 120 మంది పని చేస్తుండగా వారిలో సందానీ.. షాహీన్ లకు ఈ ఆహ్వానం లభించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన ప్రదర్శనలో ఉదయగిరి చెక్క నగిషీ కేంద్రంలో రూపొందించిన ఉత్పత్తులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తిలకించి ప్రశంసించారు. ప్రస్తుతం గణతంత్ర వేడుకలలో పాల్గొనాలని ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఆహ్వానం అందడంతో సందానీ దంపతులు హర్షం వ్యక్తం చేశారు.

==============================

పంటల సాగులో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి, ఆదాయం పెంచే లక్ష్యంతో పొలం పిలుస్తోంది పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం ద్వారా ప్రకృతి వ్యవసాయం దిశగా ముందడుగు వేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. ఈరోజు ఇబ్రహీంపట్నం మండలం, దాములూరులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ.... రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, వాటి పరిష్కారానికి ప్రణాళికాయుత చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భావితరానికి మంచి ఆరోగ్యం అందించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరించాలని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిబ్బందిని కేటాయిస్తామని తెలిపారు. అదేవిధంగా అగ్రీ కనెక్ట్ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థులను పొలానికి తీసుకెళ్లి ఇప్పటినుంచే నేల, పంటలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు.

==============================

దావోస్ పర్యటనలో భాగంగా టెమాసెక్ హోల్డింగ్స్ భారత్ ప్రతినిధి రవి లాంబాతో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో టెమాసెక్ గ్రూప్ అనుబంధ సంస్థ క్యాపిటా ల్యాండ్ ద్వారా పారిశ్రామిక పార్కులు, డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా కోరారు. విశాఖ, తిరుపతిలో కమర్షియల్ స్పేస్ ఏర్పాటు చేయడంతో పాటు, పారిశ్రామిక క్లస్టర్లలో ఆర్ఈఐటీ విధానంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

==============================

కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మంత్రాలయం వేద పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన వార్త తీవ్ర ఆవేదనను కలిగించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. హంపీకి వెళ్తూ పొరుగు రాష్ట్రంలో ప్రమాదానికి గురైన వారికి అవసరమైన వైద్య సాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంతో భవిష్యత్ ఉన్న వేద పాఠశాల విద్యార్థుల అకాల మరణంతో తీవ్ర శోకంలో ఉన్న వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులతో పాటు డ్రైవర్ కుటుంబాన్ని కూడా ఆదుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు.

==============================

ఎన్డీయే కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా కంబాల పల్లి గ్రామంలో 80 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, కల్వర్టు నిర్మాణాలను మంత్రి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రానున్న రోజుల్లో గ్రామాలకు మరిన్ని నిధులు తీసుకొస్తామని తెలిపారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడేది లేదని స్పష్టం చేశారు.

==============================

వికలాంగుల పింఛన్ల పునః పరిశీలన ప్రక్రియను రేపటి నుంచీ జిల్లాలో ప్రారంభిస్తున్నామని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అన్నారు. ఈ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన దృశ్యమాధ్యమ విధానం ద్వారా ఆయన ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 36,974 వికలాంగ పింఛన్లు ఉన్నాయని, వీటన్నిటినీ పునః పరిశీలించేందుకు షెడ్యూల్‌ను ఖరారు చేశామన్నారు. పింఛన్ పొందుతున్న వికలాంగులు తమకు కేటాయించిన తేదీలో, ఆయా ఆసుపత్రులకు వెళ్లి పరిశీలన పూర్తి చేసుకోవాలని సూచించారు. దీనికోసం జిల్లాలోని 5 ఆసుపత్రుల్లో మొత్తం 13 ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.

==============================

==============================